మాదకద్రవ్య రహిత సమాజమే ధ్యేయం

- యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు
- జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్
- డ్రగ్స్ నివారణపై ర్యాలీలు, ప్రతిజ్ఞలు

గద్వాలలో ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు

వనపర్తిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గద్వాల, జూన్ 26 : జోగుళాంబ గద్వాల జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ సంతోష్, జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కృష్ణవేణిచౌరస్తాలో మిషన్ పరివర్తన పేరుతో నిర్వహించిన అవగాహన ర్యాలీని బుధవారం కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్ ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ర్యాలీ పాత బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహనతో ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లా దవాఖానలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు మెరుగైన వైద్యచికిత్సలు అందజేస్తారని తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం డ్రగ్స్ నివారణకు సంబంధించి ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. 'ఐయాం యాంటీ డ్రగ్ సోల్జర్' అనే పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్, ఎస్పీ, జెడ్పీచైర్‌పర్సన్ సెల్ఫీలు దిగారు. అనంతరం వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో అధికారులు సుధారాణి, గుణశేఖర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

వనపర్తి టౌన్, జూన్ 26: మాదకద్రవ్య రహిత సమాజమే ధ్యేయంగా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రక్షితామూర్తి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ప్రపంచ మాదకద్రవ్య రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన అనంతరం మాదకద్రవ్యాలను నిర్మూలిస్తామని విద్యార్థులతోపాటు అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ.. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని, ఎక్కడైనా మత్తు పదార్థాలు ఉత్పత్తి చేసినా పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయకుండా చెడువ్యసనాలకు గురికావొద్దన్నారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా వనపర్తిని తీర్చిదిద్దాలన్నారు. యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అంతకుముందు జిల్లా సాంస్కృతిక కళాకారులు పాటల రూపంలో అకట్టుకున్నారు. అనంతరం బాలుర కళాశాల మైదానం నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి మాదకద్రవ్యాల నివారణ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, కృష్ణ కిశోర్, డీడబ్ల్యూవో లక్ష్మి, సఖి నిర్వాహకులు చెన్నమ్మ థామస్, బాలల సంరక్షణ అధికారి రాంబాబు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గట్టు, జూన్ 26 : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై కేటీ మల్లేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ మాదక ద్రవ్య నిరోధక దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జెడ్పీహైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రాంగణంలో మానవహారం నిర్వహించి డ్రగ్స్ బారిన పడమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజోళి మండలంలో..

రాజోళి, జూన్ 26: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉంటూ, రేపటి భవిష్యత్‌కు బాటలు వేయాలని రాజోళి ఎస్సై జగదీశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఎస్సై ప్రధాన వీధుల గుండా మాదకద్రవ్యాలను మానుకోవాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజోళి బస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తులో జీవితాలను చిత్తు చేసుకోవద్దు

అలంపూర్, జూన్ 26: విద్యార్థులు, యువత మత్తు పదార్థాల అలవాటుకు బానిసలుగా మారి నిండు జీవితాలను చిత్తు చేసుకోవద్దని ఎంఈవో అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా, పోలీస్, ఎక్సైజ్, న్యాయశాఖ ఉద్యోగులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మల్దకల్, జూన్ 26: మండల కేంద్రంలో బుధవారం ఎస్సై సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో గ్రామంలో డ్రగ్స్ రహిత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ మహమ్మారిపై ప్రజలకు నినాదాలతో అవగాహన కల్పించారు. అనంతరం పాత బస్టాండ్ ప్రాంతంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నర్సింహులు, అధ్యాపకులు రామాంజనేయులు, గోవర్ధన్‌శెట్టి, భాగ్యలక్ష్మి, జయరామ్, దేవసేనారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తిలో డ్రగ్స్ నివారణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

అయిజ మండలంలో..

అయిజ, జూన్ 26: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని తాసీల్దార్ జ్యోతి అన్నారు. బుధవారం పట్టణంలో అంతర్జాతీయ డ్రగ్స్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సై విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో కేజీబీవీ విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టి డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి చెన్న బసమ్మ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే జీవితాలు నాశనం

ఖిల్లాఘణపురం, జూన్ 26: మాదకద్రవ్యాలకు బానిసై యువత జీతాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ప్రపంచ మాదకద్రవ్య నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా బాలుర ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై నిర్వహించిన పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అదేవిధంగా పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత కీలకపాత్ర పోషించాలి

ధరూరు, జూన్ 26 : మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాల రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో యువత కీలకపాత్ర పోషించాలని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులతో భారీ ర్యాలీ తీశారు. డ్రగ్స్‌పై వ్యతిరేక నినాదాలు, డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే అనర్థాల గురించి విద్యార్థులు నినాదాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్ చౌరస్తాలో విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, కానిస్టేబుళ్లు కరుణాకర్, గోవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి మండలంలో..

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 26: డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మించాలని ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఎర్రవల్లి చౌరస్తాలో ఎస్సై, ఎంఈవో రాజు ఆధ్వర్యంలో సరస్వతి పాఠశాల, ఎర్రవల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలన ర్యాలీ నిర్వహించారు.

ఎర్రవల్లి చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తిలో పారిశుధ్యం పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూన్ 26 : జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌లతో కలిసి బుధవారం వనపర్తి, కొత్తకోట మున్సిపాలిటీల్లో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది హాజరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రధాన మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని, చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రపర్చే సమయంలో చేతులు, కాళ్లకు గ్లౌస్, బూట్లు ధరించాలన్నారు. వనపర్తిలోని పాతయూకో బ్యాంకు వద్ద కొనసాగుతున్న బీటీరోడ్డు విస్తరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. రహదారులపై మలుపుల దగ్గర సేఫ్టీ లైన్స్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వనపర్తిలోని శ్రీనివాసపురం, కొత్తకోట పట్టణంలోని నర్సరీలను కలెక్టర్ పరిశీలించారు. నర్సరీలలో స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. నర్సరీల్లో ఉన్న పెద్ద మొక్కలను అవసరమైన చోట నాటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మున్సిపల్ ఏఈలకు సూచించారు. కొత్తకోట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చివరి దశలో ఉన్న యూత్ భవన నిర్మాణాన్ని పరిశీలించి వారంరోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు పూర్ణచందర్, ఇంజినీరింగ్‌లు ఉన్నారు.

హరితహారం లక్ష్యం 18లక్షలు

వనపర్తి,జూన్ 26 : ఈ ఏడాది జిల్లాలో 18లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హరిత హారం లక్ష్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పకడ్బందీగా అమలు జరిగేందుకు ప్రత్యేకా అధికారులు వారంలో మూడురోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఉపాధిహామీ కింద చేప చెరువులు, నీటి కుంటకు ఏర్పాటుకు రైతులను అవగాహన కల్పించి ఆస్తకి ఉన్న చోట కుంటలు పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జెడ్పీడీఆర్డీవో ఉమాదేవి, డీపీవో రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రాధాన్యతా ప్రాతిపదికన సమస్యల పరిష్కారం

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు, అధికారులు

అలంపూర్, జూన్ 26: పట్టణంలో ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్కటిగా అన్ని సమస్యలు పరిష్కరించబడుతాయని మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ పేర్కొన్నారు. అలంపూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. పట్టణంలో సీసీరోడ్ల నిర్మాణం, డ్రైనేజీ మరమ్మతులు, విద్యుత్‌లైన్ స్తంభాల మార్పు, బోర్ల మోటర్ల మరమ్మతులు, మోడ్రన్ మరుగుదొడ్ల నిర్మాణం, అదనపు నీటి ట్యాంకుల నిర్మాణం, వీధి కుక్కల నిర్మూళన, పారిశుధ్య పనులు తదితరాలు చేయడానికి కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ శేఖర్ రెడ్డి, కమిషనర్ సరస్వతి, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్ అల్లాబకాశ్, ఖాలీదా బేగం, సుదర్శనమ్మ, సిబ్బంది ఉన్నారు.

నిందితుడికి మూడేండ్ల జైలు శిక్ష

గద్వాల అర్బన్, జూన్ 26 : మైనర్‌పై లైంగిక దాడి యత్నించిన నిందితుడికి మూడేండ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కె.కుషా బుధవారం తీర్పును వెల్లడించారు. వివరాలిలా.. మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ సీడ్ పత్తి కూలీ పని పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో పొలం పక్కన బహిర్భూమికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన జయరాం అనే వ్యక్తి బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ఆ వ్యక్తి నుంచి తప్పించుకొని తల్లిదండ్రుల వెళ్లి విషయం చెప్పింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు..మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసి విచారణ నిర్వహించి నిందితుడి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పూర్తి విచారణ అనంతరం కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు వేశారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో ఇరువర్గాల వాదన అనంతరం లైంగిక దాడి కేసులో నేరం రుజువుకావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన డీఎస్పీ సత్యనారాయణ, సీఐ భీంకుమార్, ఎస్సై సురేశ్ గౌడ్, అప్పటి ఎస్సైలు ఓబుల్ రెడ్డి, శేఖర్, పీపీ ఆనంద్, కోర్టు లైసన్ అధికారి అరుణ, సిబ్బంది సాయిబాబా, రాందాస్, స్వామిరాజును అభినందించారు.

'బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి'

మదనాపురం, జూన్ 26 : బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ అన్నారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలపక్షాన నిలబడి సీపీఎం పార్టీ పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. గత పదేండ్లలో ఎన్నడూ జరగని బొగ్గు గనుల వేలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వంతో చేతులు కలిపి కార్మికులను మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకట్‌రాములు, నిక్సన్, ప్రసాద్, విష్ణు, మాసన్న పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షకుడికి ఘన స్వాగతం

కృష్ణసాగర్‌ను అభినందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

వనపర్తి టౌన్, జూన్ 26: మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదంతో కృష్ణసాగర్ చేపడుతున్న పాదయాత్ర బుధవారం జిల్లా కేంద్రంలోని ఏకో పార్కుకు చేరుకున్నది. వనపర్తికి చేరుకున్న ఆయనకు స్థానిక అయ్యప్ప సేవా సమితి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యపర్చడానికి అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయనతో కలిసి మొక్కలు నాటారు. అలాగే కృష్ణసాగర్‌ను పలువురు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు మురళీధర్, ప్రముఖ కవి, రచయిత తిరుమలేశ్, యాదగిరి, శ్యామ్, సత్తార్, నాగరాజు, వెంకటయ్య, కేకే మూర్తి, విశ్వనాథం, అయ్యప్ప సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నగేశ్, కార్యదర్శి ముత్తుకృష్ణ గురుస్వామి, అర్చకులు రమేశ్‌శర్మ, గణేశ్, భాను, రాము, జనార్దన్ తదితరులు ఉన్నారు.

30ట్రాక్టర్ల ఇసుక డంపులు సీజ్

కొత్తకోట, జూన్ 26: పట్టణంలోని పెద్ద మసీదు రోడ్డు వద్ద బీసీ హాస్టల్ సమీపంలోని సురేందర్‌రెడ్డి 30ట్రాక్టర్ల ఇసుకను డంపు చేయగా.. బుధవారం ఎస్సై మంజునాథ్‌రెడ్డి, ఆర్ఐ పర్వతాలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఎద్దుల బండ్లతో ఇసుకను తన ఇంటి సమీపంలో డంపు చేశారు. ట్రాక్టర్ ఇసుకను అదనపు ధరతో ఇతరులకు విక్రయించేందుకు ఇసుకను డంపు చేసినట్లు తెలిపారు.

మత్తుకు బానిస కావొద్దు:

గద్వాల అర్బన్, జూన్ 26: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కవితాదేవి పేర్కొన్నారు. ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్ఎఎల్‌డీ డిగ్రీ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంలో న్యాయమూర్తి గంట కవితాదేవి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలు, మద్యం, పొగాకు తదితర పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. బంగారు భవిష్యత్ కోసం దిశానిర్దేశం చేసుకొని ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కలందర్ పాషా, శ్రీపతినాయుడు తదితరులు ఉన్నారు.

గద్వాలలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కవితాదేవి

మత్తులేని సమాజాన్ని నిర్మిద్దాం

వనపర్తి టౌన్, జూన్ 26: మత్తులేని సమాజాన్ని నిర్మిద్దామని సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వి.రజిని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జాగృతి కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ డ్రగ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్సై జయన్న, న్యాయ సేవా సాధికార సంస్థ కౌన్సిల్ సభ్యులు బాలనాగయ్య, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత, జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వనపర్తిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తి, న్యాయవాదులు

వనపర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అలంపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు ఉద్యోగులు

గట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

ముగిసిన శిక్షణ తరగతులు

వనపర్తి టౌన్, జూన్ 26: దేశవ్యాప్తంగా జూలై 1నుంచి అమలుకానున్న నూతన చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహిస్తున్న దశలవారీ శిక్షణ బుధవారంతో ముగిసింది. ఎస్పీ రక్షితామూర్తి ముగింపు శిక్షణకు హాజరై మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి కొత్త చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, అందరికీ దశలవారీగా శిక్షణను అందించామన్నారు. జూలై 1నుంచి కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకుసాగాల్సి ఉంటుందన్నారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆయా సెక్షన్ల కింద కేసును నమోదు చేయొచ్చన్నారు. సిబ్బంది, అధికారులు ప్రతిఒక్కరు కొత్త చట్టాలను నేర్చుకొని ప్రజలకు మరింత సమర్ధవంతమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణ కిశోర్, ఏఎస్సై మూర్తి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

అప్పాయిపల్లి నర్సరీ సందర్శన

వనపర్తి, జూన్ 26: మండలంలోని అప్పాయిపల్లి నర్సరీని ఆర్డీవో పద్మావతి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. వర్షాలు అనుకూలంగా పడిన వెంటనే హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు స్థల ఎంపిక చేసి గుంతలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవ, ఎంపీవో సుదర్శన్, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గద్వాల, జూన్ 26 : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే పద్ధతుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు గట్టన్న, వెంకటస్వామి, మహేంద్రనాథ్ మాట్లాడారు. నూతన పీఆర్‌సీలో కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. ఏపీలో పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్నట్లు రూ.21వేల వేతనాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరేశ్, ఆంజనేయులు, అడివన్న, వీరేశ్, సుధాకర్, ప్రకాశ్, రాకేశ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌బోల్తా : యువకుడు మృతి

వడ్డేపల్లి, జూన్ 26: మండలంలోని తనగల శివారులో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. అయిజ మండలంలోని ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన కల్యాణ్‌గౌడ్(24)ట్రాక్టర్‌పై రాజోళి మండలంలోని పచ్చర్లకు వెళ్తున్నాడు. తనగల శివారులో ట్రాక్టర్ బోల్తా పడడంతో కింద పడిన కల్యాణ్ అక్కడికక్కడే మృతిచెందాడు.

అన్నిరకాల సదుపాయాలతో ప్రభుత్వ వైద్య సేవలు

గద్వాల అర్బన్,జూన్ 26 : ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రభుత్వ దవాఖానకే రావాలని ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ నవీన్‌క్రాంతి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేట్ దవాఖానలో వైద్యులపై రోగి బంధువులు దాడులు చేసిన ఘటనను నిరసిస్తూ ప్రైవేట్ వైద్యులు మూడురోజులపాటు వైద్య సేవల నిలిపివేశారని గుర్తు చేశారు. ప్రజలు ఈ విషయంపై ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రభుత్వ దవాఖానలో 24గంటలపాటు నాణ్యమైన వైద్యసదుపాయాలు అందిస్తున్నాయని వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వ దవాఖాన వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ

గద్వాల అర్బన్, జూన్ 26 : జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జిల్లా ప్రధానన్యాయమూర్తి కె.కుషాను బుధవారం నూతన ఎస్పీ తోట శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదవుతున్న కేసులు, ఆయా కేసుల్లో నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై చర్చించారు. ఎస్పీ వెంట సీఐ భీంకుమార్ ఉన్నారు.

జడ్జిని కలిసిన ఎస్పీ శ్రీనివాసరావు

సీజనల్